

సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతుల క్యూ

యూరియా కోసం...

గంగాధరనెల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు తంటాలు పడుతున్నారు.ఇటీవల వర్షాలు కురిసి చెరువులన్నీ నిండడంతో వరి సాగుకు ఎక్కువమంది రైతులు సిద్ధపడుతుండడంతో యూరియాకు డిమాండు మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో మూడురోజుల క్రితం 300 బస్తాల యూరియా లోడ్ గంగాధరనెల్లూరు సింగిల్‌విండో కార్యాలయానికి వచ్చింది. ఈ సమాచారం తెలుసుకుని సోమవారం ఉదయం 8గంటలకే సింగిల్‌విండో కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలనుంచి రైతులు తరలివచ్చారు. మధ్యాహ్నం 3గంటలవరకు ఈ రద్దీ కొనసాగడంతో వారిని నియంత్రించేందుకు సింగిల్ విండో అధికారులు పోలీసుల సహకారం అభ్యర్థించారు. 300 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేశాక ఇంకా 200మంది దాకా మిగిలిపోయారు.యూరియా స్టాక్ అయిపోయిందని తెలిసి రైతులు కొందరు సింగిల్ విండో అధికారులతో వాగ్వాదానికి దిగారు. రైతులకు అవసరమైనంత స్టాకు తెప్పించడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో అధికారులు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ ముప్పిరి మోహన్ నాయుడికి సమాచారం ఇచ్చారు.ఆయన రైతులతో మాట్లాడి సర్దుబాటు చేశారు. వ్యవసాయశాఖ, సీడీసీఎంఎస్ అధికారులతో మాట్లాడి మరో మూడులోడ్ల (900 బస్తాలు) తెప్పించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.చివరకు ఆ 200మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు.ఈసారి వచ్చాక వారికి యూరియా పంపిణీ చేయనున్నారు.

కార్తీక సోమవారోత్సవం

రామకుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దేవాలయాల్లో సోమవారం కార్తీక సోమవారోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. రామకుప్పంలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శివార్లలోని వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.రాత్రి భక్తులు ఆలయాలవద్దకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద, వెనుకగల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.



సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద వనాల్లో కార్తీక దీపాలు



కార్తీక శోభలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

కుప్పానికి మరో రెండు పరిశ్రమలు

రూ.2979 కోట్లతో ఏర్పాటుకు క్యాబినెట్ కమిటీ ఆమోదం

కుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గానికి రూ.2979 కోట్ల పెట్టుబడితో మరో రెండు భారీ పరిశ్రమలు రానున్నాయి. రాష్ట్ర రాజధానిలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే ఎస్‌పీఎస్‌పీఎల్ పరిశ్రమను రూ.2,081 కోట్లతో ప్రతిపాదించారు. అలాగే హ్వాసింగ్ ఫుట్ వేర్ కంపెనీని రూ.8,570 కోట్లతో ప్రతిపాదించారు. ఈ రెండు కంపెనీల స్థాపనకు సంబంధించి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీ ద్వారా 600 ఉద్యోగాలు,ఫుట్ వేర్ కంపెనీ ద్వారా 17,645 ఉద్యోగాలు లభించనున్నాయి.ఫుట్ వేర్ కంపెనీకోసం (తోలు రహిత) కుప్పం నియోజకవర్గ పరిధిలో 103.19 ఎకరాల భూమి కేటాయించనున్నారు.ఏడాదికి 12.84 మిలియన్ల జతల చెప్పుల తయారీ సామర్థ్యం ఉంటుందని అంచనా వేశారు. ఇవిగాక రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7 పరిశ్రమలకు ఈనెల 8వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ పరిశ్రమలతో ఏకంగా 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించారు. దీంతో సమీప భవిష్యత్తులో కుప్పం పారిశ్రామిక స్వర్గధామంగా రూపుదాల్చనుంది. వేలాది ఉద్యోగాల కల్పనతో స్థానిక యువతకు ఉపాధి లభించడంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల యువతకు కూడా కుప్పం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కుప్పంలో పుష్కలంగా దొరకనున్నాయి.

నేడు రూ.206 కోట్లతో ఎఫ్ఎఫ్‌సీకి శంకుస్థాపన

కుప్పంలో మరో కంపెనీకి వర్చువల్ శంకుస్థాపన జరుగనుంది. కుప్పం మున్సిపాలిటీ పలార్లపల్లె వద్ద రూ.206.16 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)కి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతినుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్‌కుమార్ తెలిపారు. పలార్లపల్లెలో ఇప్పటికే ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కోసం 18.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఇందులోని 5 ఎకరాలను ఎఫ్ఎఫ్‌సీకి కేటాయించారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమానికి సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ఆహ్వానించారు.



పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమానికి జగన్మోహన్‌ను, రాజన్‌ను ఆహ్వానిస్తున్న ప్రేమ్‌కుమార్

మూడు ఇండస్ట్రియల్ పార్కులకు

నేడు శంకుస్థాపన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇండస్ట్రియల్ పార్కులకు నేడు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.చిత్తూరు సమీపంలోని వెంకటాపురంలో రూ. 14.30 కోట్లతో 68 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుకు, పుంగనూరు మండలం చదళ్ల గ్రామంలో రూ.9.50 కోట్ల వ్యయంతో 21.80 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు,నగరి మండలం మాంగాడు గ్రామంలో రూ.17.30 కోట్ల వ్యయంతో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కుకు సీఎం పునాదిరాయివేస్తారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

డీడీఆర్సీ సమావేశం

వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వతేదీన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరగాల్సిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం(డీడీఆర్సీ) వాయిదా పడింది. పదిశాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించేందుకు సీపీవో కార్యాలయం ఏర్పాట్లు చేసింది. పార్లమెంటు, శాసనమండలి, శాసనసభ్యులు పాల్గొనాల్సి ఉండగా వాయిదాపడినట్లు సోమవారం జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది.

నేటినుంచి స్వామిత్వ గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజోతి): గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు ఆస్తి హక్కు పత్రాలు జారీ చేసే ముందు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నారు. స్వామిత్వ పథకంలో రెండో విడత కింద ఆస్తులకు కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 300 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి విడతగా 27 గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10 నుంచి 12 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే సభలకు పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొంటారు. ఈ బృందాలకు ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు నాయకత్వం వహిస్తారు. ఆస్తులకు సంబంధించి గ్రామసభల్లో గ్రామీణుల వద్ద ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యంతరాలుంటే అక్కడికక్కడే నమోదు చేస్తారు. వీటిని వారంలోపు పరిష్కరిస్తారు. పరిష్కారం కాకపోతే ఫారం-19 ద్వారా అప్పీల్ చేసుకుని రీ సర్వే కోసం డిప్యూటీ తహసీల్దార్‌కు పంపిస్తారు. వివిధ కారణాలతో గ్రామసభలకు రానివారి ఇంటికి వెళ్లి సంతకాలు తీసుకుంటారు. యజమానుల సమాచారం లేనప్పుడు ఇంటి పన్ను వివరాలను యథాతథంగా పరిగణిస్తారు. ఆధార్, మొబైల్ నెంబరు, డాక్యుమెంట్లు తదితర వివరాలను సేకరించి డిజిటలైజేషన్ చేస్తారు. సభలో తీర్మానం చేసి గ్రామసభ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్వేశాఖలు సంయుక్తంగా ఈ నెల 22వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు.

ఢిల్లీ పేలుళ్ల ఎఫెక్ట్

ముమ్మరంగా

వాహనాల తనిఖీ



చిత్తూరులో సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుళ్ల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు.చిత్తూరు నగరంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్, ఇతరఅనుమానిత ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీచేశారు. దర్గాజంక్షన్లో చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య, సంతపేట, రాగిమాను జంక్షన్‌లో ఎస్ఐ రమేష్ వాహన తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టరుగా

మురళీమోహన్



నగరి, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి):చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి నల్లపనేని మురళీమోహన్(చినబాబు)ను రాష్ట్ర ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు) డైరెక్టరుగా నియమించారు.టీడీపీలో చాలాకాలంగా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఈయన గతంలో రామచంద్రాపురం మండలం కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర చైర్మన్‌గా, తిరుపతిలోని రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేశారు.కరోనా విపత్తు సమయంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

మృత్యుకుంట

నీటమునిగిన మామా అల్లుళ్లు

రామకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎద్దులను శుభ్రం చేసేందుకు కుంటలోకి దిగిన మేనమామ, మేనల్లుడు నీట మునిగి చనిపోయిన వైనమిది.పోలీసుల కథనం మేరకు వివరాలు...రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ కోటచేనుకు చెందిన గోవిందప్ప(29) కొన్నేళ్ళుగా బెంగళూరులో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం బంధువుల పెళ్ళి కోసం భార్యాపిల్లలతో కోటచేనుకు వచ్చాడు. సోమవారం ఉదయం తమిళనాడులోని వాణియంబాడి సమీపంలో జరిగిన పెళ్ళికి వెళ్లి తిరుగుప్రయాణంలో చెల్లెలు కుమారుడు సతీష్(16)ను కోటచేనుకు తీసుకొచ్చాడు.ఎద్దులను శుభ్రం చేసేందుకు సమీపంలోని కుంట వద్దకు తనతో పాటు సతీష్‌ను కూడా తీసుకెళ్ళాడు. ఈ క్రమంలో ఓ ఎద్దు వేగంగా నీటిలో పరుగు తీసింది. దాని తాడు గోవిందప్ప, సతీష్‌ల కాళ్ళకు చుట్టుకుంది. తాడును తీసే ప్రయత్నంలో వారిద్దరూ కుంట మధ్యలోకి జారిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయారు. వారి కేకలతో చుట్టు పక్కల రైతులు కుంటలోకి దిగి గట్టుకు చేర్చేసరికే వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. గోవిందప్పకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.ఇంటర్ చదువుతున్న సతీష్ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐ వెంకటమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. గోవిందప్ప భార్య నందిని పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సతీష్ - గోవిందప్ప (ఫైల్ ఫొటోలు)



సతీష్, గోవిందప్ప మృతదేహాలు

పలువురికి కార్పొరేషన్ల డైరెక్టర్లుగా అవకాశం



నాగరాజు | ఎం.శ్రీకాంత్ | మణికంఠ | విశ్వనాథ నాయుడు | ముత్తయ్య

చిత్తూరు సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 10 కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.టీడీపీకి చెందిన ఎ.నాగరాజు (పూతలపట్టు), ఎం.శ్రీకాంత్ (పుంగనూరు), కె.నమఃశివాయ,ఎన్.భాస్కరన్(సత్యవేడు), ఎం.మణి , వినోద్ కుమార్ (కుప్పం) ఎన్.ఎన్.ధనపాల్ , ఎస్.ముత్తయ్య (నగరి), ఎస్ఎస్.నటరాజన్ (గంగాధరనెల్లూరు), వి.గోపాలకృష్ణన్ (చిత్తూరు)లతో పాటు జనసేనకు చెందిన జి.మణికంఠ (పుంగనూరు)ను మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా టీడీపీకి చెందిన విశ్వనాథ నాయుడు (శాంతిపురం) నియమితులయ్యారు.దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గా టీడీపీకి చెందిన కోల లోకయ్య (సత్యవేడు)ను నియమించారు.

నగల కోసం దురాగతం

- బీసీ కాలనీలో మహిళపై దాడి
- అడ్డొచ్చిన మరో మహిళను అంతమొందించిన దుండగుడు



విమల మృతదేహం - తీవ్రగాయాల పాలైన కళావతమ్మ

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగల దొంగతనానికి అడ్డుపడిందని ఓ మహిళను హతమార్చిన వైనమిది.పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ బీసీ కాలనీలో అరుణాచలం ఆచారి నివసిస్తున్నాడు.ఆయనకు వరసకు మరదలైన కళావతమ్మ (65) ఇదే ఇంట్లోనే ఉంటోంది. ఇంటి మిద్దెపై విమల (59) అనే మహిళ కుమార్తె కోమలతో కలిసి బాడుగకు ఉంటోంది. సోమవారం అరుణాచలం బయటకు వెళ్లగా కళావతమ్మ ఒంటరిగా ఉంది. ఇదే సమయంలో ఓ దుండగుడు ఇంటిలో ప్రవేశించాడు. మెడలో బంగారు నగలు తీసివ్వాలని అడిగాడు. ససేమిరా అనడంతో కళావతమ్మతో పెనుగులాటకు దిగాడు. ఇంతలో మిద్దెపై ఉన్న విమల వచ్చి చూసి గట్టిగా ఎదురు తిరిగింది. దీంతో దుండగుడు విమల తలపై బలమైన ఆయుధంతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన విమల తల పగిలి మృతి చెందింది. చాకుతో పొడవడంతో కళావతమ్మ స్పృహ తప్పి పడిపోయింది. కొంతసేపటి తర్వాత తల్లి కనిపించకపోవడంతో విమల కుమార్తె కోమల కిందకి వచ్చింది. రక్తపు మడుగులో తల్లి, స్పృహ లేకుండా పడి ఉన్న కళావతమ్మలను చూసి భయంతో కేకలు వేసింది. స్థానికులు చేరుకొని కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ సాయినాథ్, సీఐ జయరామయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కింద పడిఉన్న కళావతమ్మ బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఆమెను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళావతమ్మ కోలుకుంటే హత్య జరిగిన తీరు తెలుస్తుందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. హత్యలో పాల్గొన్నది ఒకరా లేక ఇద్దరా అనేది విచారణలో తేలుతుందన్నారు. దిగుమూర్తివారి పల్లి సమీపంలో మిరియాల గుట్టలో ఉంటున్న ఒక వ్యక్తిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు.

ఓఆర్ఐకి చేరిన రెండు తాళపత్ర గ్రంథాలు




ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు తాళపత్రాలను అందజేస్తున్న రాఘవేంద్రరావు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఉద్యోగి రాఘవేంద్రరావు రెండు తాళపత్ర గ్రంథాలను రూపొందించారు. వీటిని ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. గౌతమి సంహిత అనే జైమిని మహర్షి జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్యశాస్త్రి రాసిన వ్యాఖ్యను తాళపత్ర గ్రంథ రూపంలో తెచ్చారు. సింగారాచార్య రాసిన జాతకరాజీయము గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి చేసిన తెలుగు వ్యాఖ్యానానికి తాళపత్ర గ్రంథ రూపమిచ్చారు. ఈ గ్రంథాన్ని రాఘవేంద్రరావు ఆంగ్లంలోకి అనువదించి ఓఆర్ఐకి అందజేశారు.

13 నుంచి టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):వచ్చే యేడాది మార్చిలో నిర్వహించే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఈ నెల 13 నుంచి 25వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో ఈనెల 26 నుంచి డిసెంబరు 3వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 4 నుంచి 10వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 11 నుంచి 15వరకు చెల్లించే వీలు కల్పించారు.రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.110, వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు అదనంగా రూ.60, వయస్సు నిర్ధారణ రుసుము కింద రూ.300 చెల్లించాల్సి ఉందన్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,217

తలనీలాలు సమర్పించినవారు: 25 వేలు





స్పిరిచ్యువల్ స్ట్రీట్ నమూనా డిజైన్స్

ఇస్కాన్ సమీపంలోనే

స్పిరిచ్యువల్ స్ట్రీట్

స్థల పరిశీలన

త్వరలోనే డిజైన్‌కు తుదిరూపు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆధ్యాత్మిక వీధి (స్పిరిచ్యువల్ స్ట్రీట్) ఏర్పాటు దిశగా మరో అడుగు పడింది. అడుగులు పడుతున్నాయి. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థ 'పీఎక్స్ మేక్స్' ప్రతినిధులు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు అధికారులకు దీనిపై మూడు రోజుల కిందట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలుత ఇస్కాన్ ఎదురు (కంచిమఠం)గా ఉన్న రోడ్డును స్పిరిచ్యువల్ స్ట్రీట్‌గా డిజైన్ చేసి చూపించారు. అక్కడ నివాసాలకు ఇబ్బంది వస్తుందని భావించి మరో రోడ్డును ఎంపిక చేయాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు అధికారులు సూచించడంతో మున్సిపల్ ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం అనేక రోడ్లను పరిశీలించింది. ఇస్కాన్ రోడ్డులోని కేంద్రీయ విద్యా భవన్ పక్కన మాస్టర్ ప్లాన్ రోడ్డు అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా ఉంటుందని బృందం అభిప్రాయపడింది. అలిపిరి లింక్ బస్టాండుకు ఎదురుగా, ఇస్కాన్ మందిరానికి పక్కనగల రోడ్డులో స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయడం వలన భక్తుల సందర్శనకు అనువుగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు డిజైన్స్ మార్చాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు.

వంద షాపులు

ఆధ్యాత్మిక వీధి ప్రారంభంలో ఆర్చిని ఏర్పాటు చేయనున్నారు. భజనలు, వేదమంత్రాలు, నాదస్వర ధ్వనులు, భక్తిపాటలను వినిపించేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. తులసి మాలలు మొదలుకుని ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులతో పాటు భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతామూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి.. ఇక్కడ లభిస్తాయి. దాదాపు 100కి పైగా దుకాణాలు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తెండి

ఆత్మహత్య పేరుతో బెదిరిస్తే మంచి పద్ధతికాదు ● అర్జీదారులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్ ● పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి. అంతే తప్ప పెట్రోల్‌క్యాన్ తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగడ మంచిపద్ధతి కాదు' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇటీవల కొందరు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్, డీజల్‌వెంట తీసుకొచ్చి కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు య్నన స్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఓకుటుంబం కలెక్టరేట్ వద్ద హల్‌చల్ చేసింది. తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురానికి చెందిన వీరాస్వామి దంపతులు, అతడి కుమారుడు క్యాన్ నిండా పెట్రోల్ తీసుకువచ్చారు. 'శ్రీకృష్ణాపురంలో మేము 40 ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. బంధువులు వచ్చి మా పేరుతో ఉన్నాయని దౌర్జన్యంగా పొలం దున్నుతున్నారు. దీనిపై మేము కోర్టుకు వెళ్లాం. కోర్టులో కేసు ఉండగా వారు పొలంలోకి వస్తున్నారు' అంటూ తన భార్య అమరావతితో కలిసి వీరాస్వామి నిరసన తెలిపారు. పెట్రోల్ క్యాన్‌తో వీరు రావడాన్ని గుర్తించిన పోలీసులు కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీదారులను సున్నితంగా మందలించారు. 'మీ సమస్య కోర్టు పరిధిలో ఉంది. అయినా మీరు అర్జీ ఇచ్చినపుడు రెండుమూడుసార్లు రెవెన్యూ అధికారులు వచ్చారు. అయితే మీరు మొండిగా పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం సరికాదు. ప్రతి ఒక్కరూ ఇలా బెదిరింపులకు దిగితే ఎలా? ఇలాంటి సంస్కృతిని సహించేది లేదు' అంటూ మందలించారు. తిరుచానూరు ఎస్ఐ అరుణ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపైనే 169 ఉన్నాయి.





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - కుటుంబ సభ్యులతో వీరాస్వామి

సమస్యకు పరిష్కారం దొరికింది



నేను గతంలో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశా. ఇప్పటి సీఎం చంద్రబాబుకు పాఠాలు ఆనాడు పాఠాలు చెప్పా. ఇటీవల నారావారిపల్లెకు వచ్చినపుడు నా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లా. దీనిపై కలెక్టర్‌ను కలవడానికి వచ్చాను. చాలా చక్కగా పలకరించారు. మరో వారం రోజుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందుతుందని తెలిపారు.

- కృష్ణమూర్తి, బైరాగిపట్టెడ

పింఛను ఇచ్చి ఆదుకోండి



ప్రసూతి సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. నడవలేని స్థితికి చేరుకున్నాను. వీల్‌చైర్ ఉంటే తప్ప బయట ప్రపంచాన్ని చూడలేను. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నా. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- సాలమ్మ, కోటమంగాపురం, కేవీబీపురం మండలం

మూడుచక్రాల స్కూటర్ ఇవ్వండి



వంటమాస్టర్‌గా పనిచేస్తున్న కుటుంబాన్ని పోషించేవాడిని రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాను. దీంతో నడిచే పరిస్థితి లేదు. ప్రభుత్వంపింఛను ఇస్తోంది. కుటుంబ ఆర్థిక అవసరాలకు సరిపోవడం లేదు. దివ్యాంగులకు ఇచ్చే మూడు చక్రాల స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తే యధావిధిగా వంట మాస్టర్ పనికి వెళతాను. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటా.

- జయశంకర్, మదనంబేడు, సత్యవేడు

పీజీఆర్ఎస్ ఫిర్యాదులు

పరిష్కరించకుంటే చర్యలు

● అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తే అధికారులను ఉపేక్షించనన్న ఎస్పీ



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారుల్లేక బోసిపోతున్న కౌంటర్లు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది హాజరై తమ బాధలను అధికారుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీటిలో దాదాపు 40 శాతం ఫిర్యాదులను ఇక్కడే పరిష్కరించారు. గతంతో పోలిస్తే ఈసారి అర్జీదారుల సంఖ్య తగ్గింది. దీతో అదనపు ఎస్పీలు, సీఐల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు బోసిపోయాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులే మళ్లీ మళ్లీ వచ్చి ఇబ్బంది పడుతుంటే.. సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని ఇటీవల ఎస్పీ హెచ్చరించారు. దీంతో రెండు, మూడు వారాలుగా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపడంతో.. అర్జీదారులు తగ్గారని పోలీసు వర్గాలు చెప్పాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.



శ్రీపతిబాబు .. ఎస్వీఎం శ్రీధర్.. పెరుమాళ్ మధు.. తోట వాసు.. బీడీ బాలాజి

6 కార్పొరేషన్లకు 12 మంది డైరెక్టర్లు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 10 కార్పొరేషన్లకు సంబంధించి బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో తిరుపతి జిల్లాకు సంబంధించి వివిధ కార్పొరేషన్లకుగాను 12మంది కూటమి నాయకులకు అవకాశం కల్పించింది. వీరిలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మురళీమోహన్ అలియాస్ చినబాబు (చంద్రగిరి-టీడీపీ), లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా ఆర్.మహేశ్వరి (చంద్రగిరి-టీడీపీ), కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టీడీ వరప్రసాద్ (తిరుపతి-బీజేపీ), తోట వాసుదేవ (తిరుపతి-టీడీపీ), ఎస్సీ కమిషన్ సభ్యుడిగా శ్రీపతి బాబు (సూళ్లూరుపేట-టీడీపీ), దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కోల లోకయ్య (సత్యవేడు-టీడీపీ), ప్రేమ్ కుమార్ (తిరుపతి-బీజేపీ), మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎస్వీఎం శ్రీధర్ (తిరుపతి-టీడీపీ), పెరుమాళ్ మధు (తిరుపతి-టీడీపీ), బి.డి బాలాజీ (సత్యవేడు-బీజేపీ), కె.నమశివాయం (సత్యవేడు-టీడీపీ), ఎస్.శరవణ (చంద్రగిరి- టీడీపీ) ఉన్నారు.



ఎన్.ఎన్.ధనపాల్ .. ఎస్.శరవణ.. ఎన్.భాస్కరన్.. కే.నమశ్శివాయం.. కోలా లోకయ్య.. టి.డి.వరప్రసాద్

ఘనంగా ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు

ధర్మకర్తలమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను గతం కన్నా మరింత వైభవోపేతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఇటీవల ఆలయ నూతన ధర్మకర్తలమండలి కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం జరిగిన తొలి మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జాతీయస్థాయిలో కీలక నేతలు, అధికారులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి, ఆలయం నుంచి లోబావి వరకు రోడ్డు, ఇక భక్తులకు నగదు రహిత ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై కసరత్తు చేశామన్నారు. ఇక ముక్కంటి ఆలయ పారిశుధ్య నిర్వహణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆలయంలో సెంట్రల్ ఏసీ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు పాలు పంపిణీ చేయడం, భక్తులకు స్వామివారి సన్నిధిలో విబూధి, అమ్మవారిసన్నిధిలో కుంకుమను ప్రసాదంగా ఇచ్చే అంశంపై దాతలతో చర్చిస్తామన్నారు. అనంతరం ఛైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ... తొలి ధర్మకర్తలమండలి సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ మంచి సూచనలు చేశారన్నారు. అలాగే ఈవోతో మండలి సమన్వయం చేసుకుని సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, సభ్యులు వాకిచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ప్రమేయం లేని చోరీ కేసుల్లో తన పేరు ప్రస్తావిస్తున్నాడనే హత్య



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేని చోరీ కేసుల్లో పోలీసులు వద్ద తన పేరు ప్రస్తావిస్తున్నాడనే కోపంతో మనోజ్‌ను హత్య చేశానని హరిప్రసాద్ విచారణలో చెప్పినట్టు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. సోమవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివవరాలు వెల్లడించారు. ఈనెల 2న ఆదివారం మద్యం దుకాణం సమీపంలో జరిగిన హత్య కేసులో వేలిముద్రలఆధారంగా మృతుడిని మనోజ్‌గా గుర్తించామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టామన్నారు. రేణిగుంటలో నివాసం ఉంటున్న మనోజ్, హరిప్రసాద్ కలసి చోరీలు చేసేవారని, ఈ క్రమంలో వారు జైలు శిక్షకు అనుభవించారన్నారు. ఆ తర్వాత హరిప్రసాద్ పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అయితే కొన్ని చోరీ కేసుల్లో ప్రమేయం లేకున్నా మనోజ్ పోలీసులు వద్ద తన పేరు చెబుతుండడంతో హరిప్రసాద్ పగ పెంచుకున్నాడన్నారు. అలాగే ఇటీవల హరిప్రసాద్ కాళ్లకు గాయమై నడవలేని స్థితికి చేరుకున్నాడన్నారు. దీనిపై హరిప్రసాద్‌సహా అతని భార్యపై మనోజ్ తప్పుడువ్యాఖ్యలు చేశాడన్నారు. దీంతో మరింత పగ పెంచుకున్న హరిప్రసాద్ ఎలాగైనా మనోజ్‌ను అంతమొందించాలనుకున్నాడని చెప్పారు. తన తమ్ముడు, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సుధాకర్, రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన మిత్రుడు శ్యాంసన్‌తో కలిసి పథకం ప్రకారం ప్లాస్టిక్ పట్టలు, తాళ్లు, టేప్ కొనుగోలు చేశారన్నారు. పెయింటింగ్ కాంట్రాక్ట్ కుదిరిందంటూ నవంబర్ 2వ తేదీ ఆదివారం ఉదయం లక్ష్మీనగర్ వద్ద ఉన్న తన ఇంటికి రావాలని మనోజ్‌ను పిలిచాడన్నారు. ఇంట్లోకి వచ్చిన మనోజ్ కాళ్లచేతులు కట్టి నోటికి, ముక్కుకు స్టిక్కర్ అంటించి ఊపిరి ఆడనీయకుండా చంపి వేశారన్నారు. అనంతరం మనోజ్ మృతదేహాన్ని అసంపూర్ణ భవనంలోని సంపులో వేసి వెళ్లిపోయారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు విషయాలను వెల్లడించారన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సీఐలు మంజునాథ్, జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, ట్రైనీ ఎస్ఐ ప్రవల్లిక, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులను అందించారు.

'తోతాపురి'కి మద్దతు ధర చెల్లించండి

● మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా



పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలకు గుజ్జు పరిశ్రమ యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ చెల్లిస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పాకాల మండలం రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్ ప్రొడెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజ్జుపరిశ్రమ ఎదుట సోమవారం మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి రైతులు ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కిలోకు రూ.8 చెల్లించకుండా రూ.3.70, రూ.3.90 చొప్పున ఇవ్వడం దారుణమన్నారు. కనీసం కోతకూలీ, రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో మద్దతు ధర చెల్లించకుండా ఇప్పుడు కిలోకు రూ.4లోపు చెల్లించడం తగదన్నారు. నన్నూరివారిపల్లె నుంచి గుజ్జు పరిశ్రమవరకు ర్యాలీ నిర్వహించి ఫ్యాక్టరీ మేనేజర్ బాలాజీ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ నగదు చెల్లించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనందనాయుడు, ఉపాధ్యక్షుడు లవకుమార్ రెడ్డి, కోశాధికారి చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటా



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఎన్నారై సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో తన స్నేహితుడు మహ్మద్ ఆరీఫ్ కడపలో ఓ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా మారారని, ఈ విషయం తెలిసి తానూ దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈయన నిర్ణయాన్ని కలెక్టర్ అభినందించారు.

మానసిక రోగులకోసం 'మనోబంధు'

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక రోగులను ఆదుకునేలా ప్రభుత్వం 'మనోబంధు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి కడపలో పునరావాస కేంద్రానికి తరలించి చికిత్సలు అందించి తిరిగి వారిని సమాజంలోకి చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రభీత్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు లెప్రసీ క్రాస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తిస్తారు. వైద్య చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించి పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు లక్షణాలను గుర్తిస్తే నివారించవచ్చని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ, డీఐవో శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

నిమోనియా నివారణకు అవగాహన అవసరం

నిమోనియా నివారణకు సామాజిక అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సోషల్ అండ్ యాక్షన్ న్యూట్రలైజ్ నిమోనియా సక్సెస్‌ఫులీ(ఎస్ఏఏఎన్ఎస్) బ్యానర్లు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఎస్ఏఏఎన్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ పట్ల మీడియా ప్రతినిధుల వ్యవహార శైలిని ఖండిస్తున్నాం

● జిల్లా అధికారుల సంఘం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సుమిత్‌కుమార్ పట్ల మీడియా ప్రతినిధులు వ్యవహరిస్తున్నా తీరును ఖండిస్తున్నామని జిల్లా ఆఫీసర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు, డీఆర్వో మోహన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా డీఆర్వోను ,కార్యదర్శిగా సమగ్ర శిక్ష ఏపీడీ వెంకటరమణను, కోశాధికారిగా డీసీవో లక్ష్మిని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీపీవో శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌పై రెండు రోజులుగా వివిధ మాధ్యమాల్లో తప్పుడు కథనాలను ప్రచురించడం తమకెంతో ఆందోళన కలిగించిందన్నారు. అనంతరం జిల్లా అధికారుల సంఘం ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

21న జిల్లా పెన్షనర్ల సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక పెన్షనర్ల భవ నంలో జరుగుతుందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మురుగానందం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్ కార్డులు, పీఎం ఆయుష్మాన్ భారత్ తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. 80 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించే అంశంపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు



మణికంఠేశ్వరాలయంలో దీపాలు పెడుతున్న మహిళలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరదగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవార పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాణిపాకం, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు ఉపవాస దీక్షతో ఆలయానికి విచ్చేసి మణికంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టు వద్ద పిండి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కన్నుల పండువగా కాణిపాక స్వామి కల్యాణం



ఉత్సవర్లకు గంధాభిషేకం

ఐరాల(కాణిపాకం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కార్తీక బహుళ శుద్ధ పంచమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. అలంకారం మండపం వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోకల అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం వినాయక స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకిపై ఉంచి భాజాభజంత్రీలు వాయిస్తూ కాణిపాక పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి నిధుల మంజూరు

పాలసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమల రాజుపురంలో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించడానికి రూ.36 లక్షలు నిధులు మంజూరైనట్లు డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. గత ప్రభుత్వం గంగమాంబాపురంలో సీహెచ్‌సీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. అయితే అక్కడ స్థల వివాదం వలన కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పీహెచ్‌సీ నిర్మాణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విప్ థామస్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి గ్రామస్తులతో చర్చించి తిరుమలరాజుపురంలో సీహెచ్‌సీ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారు. దీంతో ప్రభుత్వం నిర్మాణానికి అవసరమైన రూ.36 లక్షలను మంజూరు చేసింది. ఇక్కడ సీహెచ్‌సీ నిర్మాణం చేపడితే తిరుమలరాజుపురం, గంగమాంబాపురం, నరసింహాపురం, కోదండరామాపురం పంచాయతీల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కలుగుతుంది. పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీకి చుడా భూమి

● మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చిత్తూరు జిల్లాకు సంబంధించి రెండు భూ మార్పిడి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.చిత్తూరులో ఈఎస్ఐ డిస్పెన్సరీ నిర్మాణం కోసం ఇరువారం గ్రామంలోని సర్వే నెంబరు 515-6లో 0.6 సెంట్ల భూమిని డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ మెడికల్ సర్వీసెస్‌కు బదిలీచేసే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. చిత్తూరు మాస్టర్ ప్లాన్ జోనింగ్ రెగ్యులైజేషన్ ప్రకారం రక్షిత వినియోగజోన్(గ్రీన్) పరిధిలో ఉన్నందున డిస్పెన్సరీ నిర్మాణం ప్రారంభించే ముందు చుడా నుంచి భూ వినియోగమార్పు పొందే షరతుకు లోబడి ఆమోదం పొందే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే చిత్తూరు మండలం ఇరువారం గ్రామ సర్వే నెంబరు 174-8లో వంద ఎకరాల ప్రభుత్వ భూమిని పీఎంఏవై - యూ 2.0 ఏర్పాటు కోసం టిడ్కోకు ఎకరా రూ.1.10కోట్ల చొప్పున ఇచ్చేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. భూ విలువ మొత్తాన్ని ఐదు సమాన వార్షిక వాయిదాల్లో చెల్లించే విధంగా ప్రతిపాదించారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి

పుంగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):మైసూరు పూర్వపాలకుడు టిప్పుసుల్తాన్ జయంతి సందర్భంగా పుంగనూరులో సోమవారం ముస్లింలు భారీగా ర్యాలీ నిర్వహించారు.కుమ్మరవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనానికి టిప్పుసుల్తాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి తూర్పుమొగసాల, ఎంబీటీ రోడ్డు, ఇందిరాసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.



పుంగనూరులో ముస్లింల ర్యాలీ

కలెక్టరేట్‌కు వినతుల వెల్లువ



కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు

చిత్తూరు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాలు జరిగాయి. కలెక్టర్ కార్యాలయంలో బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో అర్జీదారుల నుంచి ఎస్పీ తుషార్ డూడీ వినతిపత్రాలను తీసుకున్నారు. తమ తమ దృష్టికి తెచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధిత ప్రజలకు హామీ ఇచ్చారు.

● **దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి**

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు దివ్యాంగులు కోరారు. ఇటీవల ప్రభుత్వం పింఛన్ పొందుతున్న వారికి రీ వెరిఫికేషన్ కోసం నోటీసులు ఇచ్చారన్నారు. వికలాంగత్వ పర్సంటేజీని బట్టి పింఛన్లు అందుతున్నాయని, ఇప్పుడేమో అవి చెల్లవని, రీ వెరిఫికేషన్‌లో తేలితేనే పింఛన్లు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. కుటుంబ సభ్యులకు భారంగా మారుతున్నామని, ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు ఇస్తే గౌరవంగా బతుకుతామని చెప్పారు.

● **భూ హక్కు పత్రాన్నివ్వండి**

తాను సాగు చేసుకుంటున్న భూమికి 1బి, భూ హక్కు పత్రాన్ని మంజూరు చేయాలని పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీలోని జంగాలపల్లెకు చెందిన లక్ష్మీదేవి కోరారు.ఈ విషయంలో స్థానిక అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు.కలెక్టర్ స్పందించి వెంటనే విచారించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

● **వితంతు పింఛన్ మంజూరు చేయండి**

భర్త మరణంతో కుటుంబం గడవటం కష్టంగా ఉందని, తనకు వితంతు పింఛన్‌ను మంజూరు చేయాలని గుడిపాల మండలం బొమ్మసముద్రానికి చెందిన భువనేశ్వరి కోరారు.

● **పట్టాదారు పాసుపుస్తకాన్ని మంజూరు చేయండి**

తరతరాలుగా తన అనుభవంలో ఉన్న భూమికి పట్టాదారుపాసు పుస్తకాన్ని మంజూరు చేయాలని బైరెడ్డిపల్లె మండలం తోటిరెడ్డిపల్లె పీసీగుంటకు చెందిన గుర్రప్ప కోరారు. సర్వే నెంబరు 174-8లో ఉన్న భూములను ఐదు కుటుంబాల వారు 70 ఏళ్లుగా అనుభవిస్తున్నామన్నారు. ఈ భూములకు తనకు తెలియకుండా వేరే వ్యక్తులు పట్టాదారు పాసుపుస్తకాలను తయారు చేసుకుని తమను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరగా.. పరిశీలించి చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

● **కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 301 అర్జీలు**

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లానలుమూలల నుంచి 301 మంది అర్జీదారులు హాజరై సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఇచ్చారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వాటిలో రెవెన్యూ, సర్వే శాఖలకు 211, పోలీసుశాఖకు 12, డీఆర్‌డీఏకు 30, పోలీసుశాఖకు 12, పశుసంవర్ధకశాఖకు 15, పంచాయతీరాజ్‌శాఖకు 3 అర్జీలు పోను ఎస్సీ కార్పొరేషన్, విద్యుత్‌శాఖ, భూగర్భగనుల శాఖ, ఎంప్లాయిమెంట్, గృహనిర్మాణ సంస్థ, ఎంపీడీవోలు, మున్సిపాలిటీలకు 18 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

● **జిల్లా పోలీసు కార్యాలయానికి 43 ఫిర్యాదులు**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 43 మంది అర్జీదారులు హాజరై సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. బాధితుల నుంచి ఎస్పీ తుషార్ డూడీ వినతిపత్రాలను తీసుకుని వారి సమస్యలను విన్నారు. వాటిలో చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 1, ఇంటి తగాదాలు 3, భర్త వేధింపులు 3, భూ తగాదాలు 8, ప్రేమ వివాహం 1, మిస్సింగ్ కేసులు 2, డబ్బు తగాదాలు 12, ఆస్తి తగాదాలు 5, దారి సమస్యలు 1 వంతున అందాయి.

వైభవంగా స్థండిల మండలీశ్వర పూజ





పూజాద్రవ్యాలను తీసుకొస్తున్న ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది - అలంకార మండపం వద్ద ఏర్పాటు చేసిన కలశాలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం సాయంత్రం పవిత్రోత్సవాల్లో భాగంగా మండలీశ్వర పూజను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. తొలుత ఏఈవో రవీంద్రబాబు సిబ్బందితో కలసి పూజాద్రవ్యాలను ప్రధాన ఆలయం నుంచి అలంకార మండపం వద్దకు తీసుకొచ్చారు. సాయంత్రం 5 గంటలకు ఆలయంలో అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, వాస్తుశాంతి, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, స్థండిల మండలేశ్వర పూజ, గంధ పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, దీపారాధన నిర్వహించారు, ఆలయంలో ఈ పూజాది కార్యక్రమాలను మరో రెండు రోజులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

గజ రాజుల బీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు



ధ్వంసమైన వరి పంట

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద కమ్మపల్లి చేరుకున్నాయి. ముందుగా దేశిరెడ్డిగారిపల్లిలోని రైతులు రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డికి చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. బాలిరెడ్డిగారిపల్లికి రైతులు హైమావతి, తిమ్మారెడ్డి, గరుడారెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. శిద్దయ్యానాయుడు, సతీష్‌నాయుడు, రమాదేవి, సుదాకర్‌నాయుడుకు చెందిన వరి, కొబ్బరి, అరటి, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. పొలాల్లోనే పేడ దిబ్బలు వేసిన నానా బీభత్సం చేశాయి. అక్కడి నుంచి రోడ్డు పక్కనున్న కలబందలను తింటూ అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. మార్గమధ్యంలో మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం పగలంతా అడవిలోని సూరప్ప చెరువు వద్ద ఏనుగులు సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

రెండు పంచాయతీలుగా ననియాలతండా



చిత్తూరు పీజీఆర్ఎస్‌లో రామాపురంతండా వాసులు

రామకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ననియాలతండా గ్రామ పంచాయతీని రెండుగా విభజించే ప్రక్రియను 15రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టరు సుమిత్‌కుమార్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. రామాపురంతండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం ననియాలతండా, రామాపురంతండాలను కలిపి 2019లో రాష్ట్ర ప్రభుత్వం ననియాలతండా పంచాయతీని ఏర్పాటు చేసింది. రెండు గ్రామాల మధ్య సుమారు 8కిలోమీటర్ల దూరం ఉండటంతో రామాపురంతండా వాసులు ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2020లో ఈ పంచాయతీ ఎన్నికలు కూడా జరగలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు తీర్పును వెలువరించింది. ననియాలతండా, రామాపురంతండాలను వేర్వేరు పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్‌సెక్రటరీ, కమీషనర్, జిల్లా కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల అమలులో జాప్యం జరుగుతుండటంతో గ్రామస్థులు సోమవారం పీజీఆర్ఎస్‌కు హాజరై కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించి కలెక్టరు 15రోజుల్లోకి ననియాలతండా, రామపురంతండాలను వేర్వేరు పంచాయతీలుగా విభజించే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

వైసీపీలో అసమ్మతివర్గం రాజీ యత్నం

వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు నారాయణస్వామి, కృపాలక్ష్మిపై అసమ్మతి గళం విప్పి సస్పెన్షన్‌కు గురైన పార్టీ నాయకులు రాజీ ప్రయత్నాల్లో పడ్డారు. పాలసముద్రం ఎంపీపీ శ్యామల భర్త శివప్రకాష్‌రాజును, వెదురుకుప్పానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డిని ఇటీవల పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారంటూ బహిష్కరించిన విషయం తెలిసిందే. నారాయణస్వామిని వ్యతిరేకిస్తున్న అసమ్మతి నేతలంతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి దయాసాగర్ రెడ్డి సూచన మేరకు తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, కరుణాకరరెడ్డిని కలసి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. అయితే క్రమశిక్షణ ఉల్లంఘన మంచి పద్ధతి కాదని కరుణాకరరెడ్డి హితబోధ చేసినట్లు సమాచారం. కృపాలక్ష్మి అందుబాటులో లేకపోవడం వల్ల నారాయణస్వామిని పిలిపించి రాజీ ప్రయత్నాలు చేశారని తెలిసింది.పార్టీ నుంచి బహిష్కరించుకుంటూ పోతే మనకే నష్టమని నారాయణస్వామికి చెప్పడంతో ఆయన కొంత తగ్గినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అయితే నారాయణస్వామి తన చతురతతో మిథున్‌రెడ్డి వచ్చాక ఈ విషయం చర్చిద్దామని వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మారని సచివాలయ సిబ్బంది తీరు

చిత్తూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని సచివాలయాల సిబ్బంది తీరు మారలేదు. గత నెల 28వ తేదిన మండలంలోని సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంపై ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే ఈ సోమవారం ప్రతి సచివాలయంలో ఇద్దరు ముగ్గురు తప్ప సిబ్బంది కన్పించలేదు.బీఎన్ఆర్ పేట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే అందుబాటులో వున్నారు.పాలూరు సచివాలయంలో కూడా పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ తప్ప మిగతావారెవరూ అందుబాటులో లేరు. మిగిలిన సచివాలయాల్లో కూడా ఇద్దరు, ముగ్గురే కన్పించారు. దీంతో వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చిన అర్జీదారులు నిరాశతో వెనుదిరిగారు.



పాలూరు సచివాలయంలో కరువైన సిబ్బంది

రైతుపై వైసీపీ నాయకుడి దాడి





చికిత్స పొందుతున్న జయశంకర్, రాజమ్మ

చౌడేపల్లె, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కమలమ్మ భర్త బాస్కర్ తనపై దాడి చేశారని ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బాధితుల కథనం మేరకు వివరాలు. అగిస్దీగానిపల్లెకు చెందిన జయశంకర్ కాటిపేరి సమీపంలోని కొంత డీకేటి భూమిని 30 ఏళ్ళుగా సాగు చేసుకుంటున్నాడు. పాలిటెక్నిక్ కళాశాల కోసం అధికారులు ఈ భూమిని తీసుకుని, గ్రామం సమీపంలో ఎకరం భూమికి పట్టా, పాసు పుస్తకం ఇచ్చారన్నారు. తమ భూమిపై కన్నేసిన మాజీ ఎంపీటీసీ కమలమ్మ భర్త బాస్కర్ తరచూ తమతో తగవులకు దిగుతున్నారన్నాడు. ఇటీవల వీఆర్వో విచారించి భూమి తమదేనని, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని వెళ్లారన్నారు. ఈక్రమంలో సోమవారం పొలం వద్ద పని చేసుకుంటుండగా భాస్కర్ అనుచరులతో వచ్చి తనపైన, అత్త రాజమ్మలపై దాడి చేసి గాయపరిచారన్నాడు. వీరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈస్తటిక్ పురస్కార ప్రదానం



పురస్కారం అందుకుంటున్న బాలాజి

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ ఖమ్మం ఈస్తటిక్ పురస్కారం అందుకున్నారు. ఖమ్మంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మకమైన ఈ జాతీయ సాహిత్య పురస్కారాన్ని నిర్వాహకులు అందజేసి ఆయన్ను సన్మానించారు. సాహితీవేత్తలు డాక్టర్ లంకా శివరామప్రసాద్, డాక్టర్ రవిమారుత్, మువ్వాశ్రీనివాసరావు, కన్నెగంటి వెంకటయ్య చేతులు మీదుగా బాలాజీ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు ప్రసేన్, ప్రతిమ, సీతారాం, వంశీకృష్ణ, కుప్పిలిపద్మ, డాక్టర్ వెల్దండి శ్రీధర్, మువ్వాజయశ్రీ, జాన్సీపాపుదేసి, ఒమ్మిరమేష్‌బాబు, మునిసురేష్‌పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతకు రూ.50 వేల ప్రోత్సాహం



ప్రథమ స్థాన విజేత హైదరాబాద్‌జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

రొంపిచెర్ల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 8,9 తేదీల్లో జరిగిన సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో మెదటి విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు స్విచ్ గేర్ స్ట్రక్చరల్ కంపెనీ అధినేత ఒవిఆర్ సురేంద్రబాబు రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. రెండు, మూడు నాల్గవ స్థానాల్లో నిలచిన చెన్నై ఎస్‌ఆర్‌ఎం జట్టు, పాండిచ్చేరి ,కాకినాడ క్రీడాకారుల జట్టులకు టోర్నమెంట్ నిర్వాహకులు రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేలు నగదు, షీల్డులు, ప్రోత్సాహక బహుమంతులను అందజేశారు. నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు షైషబ్బీర్, టి.రౌనఖ్, ఎస్.ఆజమ్ పాల్గొన్నారు.

కృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్టకు విరాళాలు


విరాళం అందజేస్తున్న విశ్రాంత హెచ్‌ఎం మునివెంకటప్ప

సోమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్టకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కోశాధికారులు మునివెంకటప్ప, జ్యోతీశ్వరుడు తెలిపారు. సోమలకు చెందిన మొగిలప్పగారి కళావతమ్మ, రాధాకృష్ణయ్యలు రూ.1,00,000, విశాంత్ర హెచ్‌ఎం. బళ్ళాపురం శాంతకుమారి, మునివెంకటప్ప రూ.1,00, 116, శెట్టి వారి అశోక్ రూ.15 వేలు, ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వై.సాంబయ్యరూ.10 వేలు, టీచర్ రవీంద్ర రూ. 10,116, వరదం శ్రీకాంత్, డ్రైవర్ శ్రీనివాసులు రూ.10,116, విశాంత్ర పీఈటీ నడవల వెంకటరమణ రూ.5వేలు అందజేసినట్లు తెలిపారు. మాజీ సర్పంచు శ్రీరాములు, సదాశివయ్య, మల్లికార్జున, రాంబాబు, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో ఆకస్మిక తనిఖీ

కుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):అడవిబూదుగూరు హరిజనవాడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో -2 రాజారాం సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. రాత పుస్తకాలు, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్, పాఠశా రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతుల పనులను పరిశీలించారు. నాణ్యతా లోపం లేకుండా పనులు పటిష్ఠంగా చేయించాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జగదీశ్, ప్రధానోపాధ్యాయుడు పోతుగుంట చిట్టిబాబులకు సూచించారు. ఉపాధ్యాయులు నవీన్, జయశ్రీ, వెంకట్రాయశెట్టి లు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు

కుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 23వ వార్డు పరిధిలోని మునస్వామిపురం బీసీ కాలనీ శ్మశాన వాటికను సోమవారం కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ స్థానిక టీడీపీ నాయకులతో కలసి సందర్శించారు. దీనిని అభివృద్ధి చేయాలని, ప్రహరీ నిర్మించాలని స్థానికులు ఆయనకు విన్నవించారు. స్పందించిన రాజ్‌కుమార్, శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సంబంధిత చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. టీడీపీ బూత్ ఇన్‌చార్జి భరీత్, కోయూనిట్ ఇన్‌చార్జి సురేశ్, వెంకటేశ్, రామన్ పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలు ఆరోగ్యకరం

రొంపిచెర్ల,నవంబరు10(ఆంధ్రజ్యోతి): పురిటి బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్ చె ప్పారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, షుగర్, బీపీ వంటి పరీక్ష చేసి తగిన సూచనలు ఇచ్చారు. వ్యక్తి గత శుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈ రాజేవ్వరి, సీహెచ్‌వో అమ్మణ్ణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తీర్ణతాశాతం పెంచాలి


కందూరు పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ లోకేశ్వరరెడ్డి

సోమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ స్కూళ్లను డిప్యూటీ ఈవో లోకేశ్వరరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. సోమల, పెద్ద ఉప్పరపల్లె, కం దూరు పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మెరుగైన బోధన అందించాలని ఆదేశించారు. ఎస్‌ఏ 1 పరీక్షలు నిర్వహించే సరళిని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఏంఈవో శివరత్న, హెచ్‌ఎంలు హేమసుధాకర్, వాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదుం: డిప్యూటీ డీఈవో లోకేశ్వర్ రెడ్డి సోమవారం సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్-1 పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. తెల్ల కాగితాలపై కాకుండా పరీక్షలకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన అసెస్మెంట్ బుక్స్‌ను పరిశీలించారు. ఎంఈవో దామోదర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం

పుంగనూరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు చేయడం దారుణమని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్.అశోక్‌కుమార్, బ్యాంకు రెడ్డెప్పలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చౌడేపల్లె మండలం కాటిపేరి రెవెన్యూ పరిధిలోని 83మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. కాటిపేరికి చెందిన కొందరు సీఎల్‌డీపీ భూముల్లోకి వెళ్లకుండా భాస్కర్ పై దాడి చేసి గాయపరిచినట్లు చెప్పారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

రామకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలో అనూహ్యమైన అభివృద్ధి జరుగుతోందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు అన్నారు. సోమవారం తిమ్మసముద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మండల సమాఖ్య కార్యాయలం వరకు రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు సీతాపతి, విజయ్‌కుమార్‌రెడ్డి, అంజనేయప్ప, కేశవరెడ్డి, అల్లీశీన పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


వేణుగోపాల్‌రెడ్డి(ఫైల్‌ఫోటో)

పెద్దపంజాణి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):టీడీపీలో క్రియాశీలక నాయకుడు రోజాక్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి(48) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలో పార్టీ కార్యక్రమాల్లో ఈయన చురుగ్గా వ్యవహరించే వారు. ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి స్వగ్రామం నేలపల్లెలో మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయి. ఈయన మృతికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సంతాపం ప్రకటించారు.

తేజశ్రీకి నగదు ప్రోత్సాహకం


తేజశ్రీని అభినందిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన తేజశ్రీకి టీడీపీ నాయకులు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కుప్పం జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో 8వ తరగి చదువుతున్న తేజశ్రీ, ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, వేలు, కన్నన్‌లు సోమవారం ఈ విద్యార్థినికి శాలువ కప్పి సత్కారం చేశారు. రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

సోమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు ప్రజల నుంచి అందిన భూసమస్యలను క్షేత్రస్థాయి సందర్శనలతో పరిష్కరించాలని తహసీల్దార్ మధుసూదన్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పలువురు భూసమస్యలపై ఫిర్యాదులు చేశారు. వందల ఏళ్లుగా సెటిల్‌మెంట్ భూమి రికార్డులు ఉన్నా ఆభూములను కొందరు ఆక్రమించుకున్నారని వల్లిగట్ల రెడ్డెమ్మ ఫిర్యాదు చేసింది. పలు భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. మరి కొందరు రెవెన్యూ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వాటిపై వీర్వోలతో సమీక్షించారు. ఆర్‌ఐ సుబుక్తుల్లా, రామస్వామి, పురుషోత్తం, మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా ఈనెల 17న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, ప్రభాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేసులు

పలమనేరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం ప్రెషర్స్‌డే జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, పాఠ్యాంశాల అధ్యయనంలో ప్రణాళిక కావాలన్నారు.. దిశానిర్దేశం లేకుండా ఏరంగంలోను రాణించలేమన్నారు. ప్రిన్సిపాల్ ఎం. వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బెనర్జీ, డాక్టర్ ఈవాసు, డాక్టర్ రుక్మిణి, ఇతర అధ్యాపకులు, విద్యార్థుపాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



బైరెడ్డిపల్లె, న వంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరో గ్యకేంద్రంలో సో మవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. ఈ సందర్భంగా గర్భిణులు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత తదితర అంశాల గురించి డాక్టర్ శాలిని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ట

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రంగాపురంలోని నిర్మించిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే .అమరనాథరెడ్డి ఇక్కడి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్వీబాలాజి, మార్కెట్ కమిటి చైర్మన్ రాజన్న, నాయకులు ఆర్బీసీకుట్టి, సుబ్రహ్మణ్యంగౌడు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు


మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కేదార నోములను అచరిస్తున్న భక్తులు

సోమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడవ సోమవారం సందర్భంగా సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కేదారేశ్వరి గౌరీ నోముల భక్తులతో సందడిగా మారింది. దుర్గంకొండ, ఇరికిపెంట నేలమల్లేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయం, రెడ్డివారిపల్లె ఈశ్వరాలయంల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. **రొంపిచెర్ల:** పెద్దగొట్టిగళ్లు ఓంకారేశ్వరస్వామి, మోటుమల్లెల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, రొంపిచెర్ల సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు కేదారవ్రత నోములు చేశారు. సిద్దేశ్వర ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం చేశారు. **చౌడేపల్లె:** స్థానిక బజారు వీధిలో అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు భక్తులకు కేదారీశ్వర నోముల వ్రత కథను వివరించి భక్తులచే నోముల వ్రతాన్ని అచరింప చేశారు. **బైరెడ్డిపల్లె:** తీర్థంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో సోమవారం కార్తీకదామోదరపూజ ఘనంగా నిర్వహించారు. **పుంగనూరు:** స్థానిక కోనేరు వద్ద అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుంగనూరు నేతలను వరించిన డైరెక్టర్ పదవులు

పుంగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పుంగనూరుకు చెందిన ఇద్దరు నాయకులను పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఎం.శ్రీకాంత్, జనసేన పట్టణ మాజీ అధ్యక్షుడు జి.మణికంఠలను నియమిస్తూ ఉత్తర్వులు రానున్నాయి. శ్రీకాంత్ తొలినుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్సీ ఆర్.రెడ్డెప్పరెడ్డి వర్గీయునిగా ఉన్నారు. శ్రీకాంత్ ఇళ్లు, ద్విచక్రవాహనాలకు ప్రత్యర్థులు నిప్పుపెట్టడం, అక్రమ కేసులతో వేధించడం, గత మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ వేయనీయకుండా దాడి వంటివి చేశారు. అయినా పార్టీని వీడకుండా పనిచేశారు. ఈనేపథ్యంలో చల్లా సిఫార్సుతో శ్రీకాంత్‌కు తాజాగా పదవి వచ్చింది. పుంగనూరుకు చెందిన ఉదయ్‌కుమార్ కుమారుడు మణికంఠ పుంగనూరు మాజీ పట్టణ జనసేన అధ్యక్షుడిగా పనిచేశారు.

ఎమ్మెల్యే గారూ..మీ సాయం మరువలేను

● అమరనాథరెడ్డికి ఓ యువతి కృతజ్ఞతలు


ఎమ్మెల్యేకు తన పీజీ పట్టాను చూపుతున్న యమున, కుటుంబ సభ్యులు

పెద్దపంజాణి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తన ఉన్నత విద్యకు సహకరించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతి కృతజ్ఞతలు తెలియజేసింది. పెద్దపంజాణి మండలం రాయలపేట పంచాయతీ గుడ్లంవారిపల్లెకు చెందిన నారాయణ కుమార్తె యమున ఎం ఫార్మ్, పీహెచ్‌డీలను పూర్తి చేసింది. మైసూరులోని జెఎస్ఎస్ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో డాక్టరేట్ పూర్తి చేసింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలో ఆగిపోతుందన్న ఆందోళన చెందుతున్న సమయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆమె ప్రతిభను గుర్తించి సాయమందించారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి రాయితీలు ఇప్పించి తన ఉన్నతికి దోహదపడ్డారని యమున పేర్కొంది. అంతేకాకుండా హైదరాబాదులో ఉద్యోగావకాశం కల్పించారంటూ ఆమె కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యేను సోమవారం కలిసింది. కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్డీవో కార్యాలయంలో అర్జీల స్వీకరణ


మహిళ నుంచి అర్జీస్వీకరిస్తున్న ఆర్డీవో భవానీ

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని తహసీల్దార్లను ఆర్డీవో భవానీ ఆదేశించారు. సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా పలు మండలాల రైతులు ఆర్డీవోకు అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలు మినహా భూవివాదాలు, సర్వే దారి, పట్టాదారు పాసుపుస్తకాల సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లికి చెందిన మంగమ్మ అనే మహిళ తమకు సంబంధించిన భూమిని అధికారులు సర్వే చేయించి సరిహద్దులు చూపి రాళ్ల నాటినా కొందరు ఆక్రమించుకున్నేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈమె సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పుంగనూరు రూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడాపోటీలకు చంద్రమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లె జడ్పీహైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలో గానవి, విజయ్, గోవర్ధన్, తేజస్విలు ఎంపికైనట్లు వివరించారు. వీరు ఈనెల 19 నుంచి 21 వరకు మదనపల్లె గ్రీన్‌వాలీ ఆవరణలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు వెంకటరమణరెడ్డి, రమణమ్మ, మణి, శంకర్‌రెడ్డి, రఘు అభినందించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


బెగ్గిలపల్లె సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లాలని ప్రభుత్వ వీప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తమ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం బెగ్గిలపల్లె, శెట్టిపల్లె, పెద్దబదనవాడ పంచాయతీల్లో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నియోజకవర్గాన్ని పారిశ్రామికగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. పొగురుపల్లెలో కొత్తగా మూడు పరిశ్రమలతో పాటు మరో ఐదు త్వరలో ఏర్పాటు కానున్నాయన్నారు. నాయకులు కలిసి కట్టుగా పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు.. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఏఎంసీ చైర్మన్ మునిరాజు మండాలాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, టీటీడీ బోర్డు మెంబరు శాంతారామ్, మాజీ మండలాధ్యక్షులు బాబు, హేమాంబర్ గౌడ్, బేటప్ప నాయుడు, బాలాజీ, యల్లప్ప, ఎంపీటీసీ తులసీ కుమార్, వెంకటేష్, గోవిందస్వామి, సురేష్, ఉదయ్‌కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన బెగ్గిలపల్లె పంచాయతీ యువత అధ్యక్షుడు ఉద్రేశ్‌కు ఎమ్మెలీ రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

అభివృద్ధిని చాటి చెప్పాలి: గౌనివారి


సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారిశ్రీనివాసులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి. సంక్షేమ పథకాలకు ప్రజలకు కార్యకర్తలు, నేతలు చాటి చెప్పాలని మాజీ ఎమ్మల్సీ గౌనివారిశ్రీనివాసులు, టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు నందింగంఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడులు కోరారు. సోమవారం వకొలమడుగు, దండికుప్పం, శివరామపురం, అబకలదొడ్డి, గుంజార్లపల్లెల్లో పంచాయతీ సమన్వయ కమిటీల సమావేశాల్లో వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టత విషయంలో ఎవరూ అశ్రద్ధ చూపరాదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, విండో చైర్మన్ గోపాల్, నేతలు అనసూయ, చంద్ర, రాజేంద్ర, ఆర్‌ఎస్‌మణీ,తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ సేవలు అమూల్యం



విజేతలతో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషకు సీపీ బ్రౌన్ చేసిన సేవలు వెలకట్టలేనివనిప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు పేర్కొన్నారు. సోమవారం బ్రౌన్ జయంతి సందర్భంగా జరిగిన ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రౌన్ స్వతహాగా ఆంగ్లేయుడైనా తెలుగు భాషపై మమకారంతో తన సర్వస్వాన్ని తెలుగు సాహిత్య పరిశోధనలకు కేటాయించి తెలుగు వారి హృదయాల్లో నిలిచిపోయారన్నారు. తెలుగువిభాగాధిపతి డాక్టర్ ఈ.వాసు, వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంగవరం: బ్రౌన్‌ను ఆదర్శంగా తీసుకొని తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. కళామందిరంలో బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వకృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులతో పెద్దిరెడ్డి సమావేశం


చౌడేపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

చౌడేపల్లె, నవంబరు11(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం .ఎ.కొత్తకోట, చారాల, దుర్గసముద్రం, చిట్రెడ్డిపల్లె, చౌడేపల్లె, పుదిపట్ల, 29 ఏ చింతమాకులపల్లె, పెద్దయల్లకుంట్ల, వెంగళపల్లె, దిగువపల్లెల్లో పర్యటించారు.వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ మండలాధ్యక్షులు నాగభూషణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగాలపల్లె వెంకటరమణ, రుక్మిణమ్మ, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

13న మండల సమావేశం

బైరెడ్డిపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్యసమావేశం ఈనెల 13న స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శాఖలవారీగా సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి బీమా అందజేత

రామకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె పంచాయతీ బిరుగుండ్లపల్లె తండాకు చెందిన టీడీపీ కార్యకర్త పార్వతమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె రూ.100చెల్లించి టీడీపీ సభ్యత్వం పొందిన క్రమంలో పార్టీ రూ.5లక్షల బీమా సొమ్మును మంజూరు చేసింది. సోమవారం బీమా మంజూరు పత్రాన్ని పార్వతమ్మ భర్త స్వామినాయక్‌కు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ రవిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నేతలు రమేష్‌రెడ్డి, రంగనాథం, విజయ్‌కుమార్‌పాల్గొన్నారు.

అంగడిని ఢీకొన్న కారు
ఇద్దరికి స్వల్పగాయాలు

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు-పీలేరు రోడ్డులో అంగడి బంకును కారు ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. హైదరాబాదుకు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు కారులో ఆదివారం రాత్రి తిరువన్నామలై బయలుదేరారు. కల్లూరు పెట్రోల్ బంకు సమీపంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న అంగడి బంకును కారు అతివేగంతో ఢీకొంది. బంకులో ఉన్న ప్రిజ్ తదితర వస్తువులు ధ్వంసమయ్యాయి. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



సదుం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ షేక్ షావలి కథనం మేరకు సదుం-తాటిగుంట పాళెం రోడ్డు రహదారిలో గుర్రమోనికుంట రోడ్డు పక్కన గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద కేసుగా నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ కారణాలతో చికిత్స పొంది, సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరమని చెప్పారు. పేరు పేరునా లబ్ధిదారులను పలకరించి, వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు అర్బన్-15, చిత్తూరు రూరల్-2, గుడిపాల-2 చొప్పున మొత్తం రూ.16 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, నేతలు సీఎం విజయ, మోహన్‌రాజ్, ఈశ్వర్, అనురాధ, గిరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో నా భర్తకు అవమానం

● ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తా



ఎంపీటీసీ సుజాత

వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలందించిన తన భర్త పేట ధనంజయులురెడ్డిని రెండుసార్లు ఆ పార్టీ అవమానించి బహిష్కరించిందని వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సుజాత అలియాస్ చిట్టెమ్మ సోమవారం తెలిపారు. తన భర్త పార్టీ బలోపేతానికి శ్రమిస్తే ఎమ్మెల్యే హోదాలో నారాయణస్వామి ఒకసారి, ప్రస్తుతం ఆయన కుమార్తె సమన్వయకర్త కృపాలక్ష్మి హయాంలో మరోసారి నిష్కారణంగా పార్టీ నుంచి బహిష్కరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీలో విలువ లేని సమయంలో తాను కూడా నల్లవెంగనపల్లె ఎంపీటీసీ పదవికి రెండురోజుల్లో రాజీనామా చేస్తానని తెలిపారు. తనతో పాటు రాజీనామా చేయడానికి మరో ముగ్గురు ఎంపీటీసీలు టచ్‌లో ఉన్నారని ఆమె తెలిపారు.

తడుకుపేట వద్ద మూడు వాహనాల ఢీ



క్రేన్ ఢీకొట్టిన టిప్పర్, జేసీబీని ఢీకొట్టిన క్రేన్

నగరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తడుకుపేట వద్ద సోమవారం సాయంత్రం మూడు వాహనాలు ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. హైవే రోడ్డు పనులు చేస్తున్న సమయంలో జేసీబీని ఓ భారీ క్రేన్ ఢీకొట్టింది. అలాగే ఆ క్రేన్‌ను మరో టిప్పర్ ఢీకొనడంతో, టిప్పర్ ముందుభాగం దెబ్బతింది. హైవే రోడ్డు పనులు జరిగే చోట తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటివి సంభవించకుండా హైవే అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను నిర్వహించి ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించారు. ఇందులో ఇంజనీరింగ్‌కు 4, ప్రజారోగ్యవిభాగంకు 2, టౌన్‌ప్లానింగ్‌కు 2, రెవెన్యూ, టిడ్కో, పింఛన్‌కు సంబంధించి ఒక్కొక్కటిచొప్పున మొత్తం 11 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి తాగునీటి సమస్య పరిష్కారం



గొల్లపల్లిలో బోరు వేస్తున్న దృశ్యం

పెనుమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీపల్లి పంచాయతీ గొల్లపల్లి దళితవాడకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎన్నో ఏళ్లుగా నీటి సౌకర్యం లేక వ్యవసాయ బోర్ల నుంచి గ్రామస్తులు నీరు తెచ్చుకుంటున్నారు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతిలో తాగునీటి వసతి కల్పించండి అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో ఎమ్మెల్యే థామస్ అధికారులతో మాట్లాడి నూతన బోరు డ్రిల్‌కు నిధులు మంజూరు చేయించారు. సోమవారం బోరు 520 అడుగులు డ్రిల్ చేయగా పుష్కలంగా నీరు పడటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

● కార్వేటినగరంలో కేసు నమోదు

వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సంప్రదాయబద్ధంగా వివాహం జరిగి, కట్నకానుకలు ఇచ్చినా అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని, వారి వేధింపులు భరించలేకపోతున్నామని కార్వేటినగరం పోలీసులకు సోమవారం బాధితురాలు యామిని(19) ఫిర్యాదు చేయడంతో ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. కార్వేటినగరం మండలం వడ్డిఇండ్లుకు చెందిన యామిని(19)కి తిరుపతిలోని అయోధ్యనగర్ (జీవకోన)కు చెందిన వీడీగవన్‌కుమార్‌తో 2023లో వివాహం జరిగింది. ఆ సందర్భంగా 118 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమెను మళ్లీ అదనపు కట్న కానుకలు తేవాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో భర్త వీడీ గవన్‌కుమార్, అత్త వరలక్ష్మి, మామ దామోదరం, అత్తింటి వారు సాయి, మౌనిక తదితరులు తనను శారీరకంగా, మానసికంగా వేధించి, గృహ హింసకు పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ వేధింపులపై పలుసార్లు పంచాయతీ పెట్టినా అత్తింటి వారిలో మార్పు రాలేదని తెలిపింది. దీనిపై కార్వేటినగరం పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మారణాయుధాలతో మహిళపై దాడి

- కేసు నమోదు

వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం అమ్మపల్లికి చెందిన కవిత తనపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేశారని కార్వేటినగరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు... కార్వేటినగరం మండలంలోని అమ్మపల్లికి చెందిన కె.కవిత(47) అదే గ్రామంలోని నాగార్జునకు పాత కక్షలు ఉన్నాయి. ఆమె ఇంటి వద్దకు ఆదివారం రాత్రి జి.నాగార్జున, కె.శేఖర్, మరి కొందరు వచ్చి ఇంటి ప్రహరీ గోడలను ధ్వంసం చేశారు. ఆమెపై మారణాయుధాలతో దాడి చేసి, కాళ్లతో తన్ని కొట్టారు. బూతులు తిట్టారు. గట్టిగా కేకలు వేయడంతో ఆమె బంధువులు రావడంతో అక్కడి నుంచి ప్రత్యర్థులు పరుగులు తీశారు. ఈ విషయమై ఆమె సోమవారం కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్యాంకర్ డ్రైవర్ మృతి



బాబు మృతదేహం

యాదమరి, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని పెరుమాళ్‌పల్లె గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉన్న ఓ ట్యాంకర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా కుప్పకూలి మరణించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మోర్ధానపల్లి పంచాయతీ 180 మజరా కొత్తపల్లి గ్రామానికి చెందిన జె.మునస్వామి కుమారుడు బాబు (35) ఐవోసీఎల్ సంస్థలో ప్రైవేట్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం విధుల్లో చేరిన బాబు, డీజిల్ ట్యాంకర్‌ను ఐవోసీఎల్ ప్లాంట్ వద్ద నింపిన అనంతరం ట్యాంకర్‌ను ప్లాంట్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతానికి నడుపుతూ ఆకస్మాత్తుగా వాహనాన్ని ఆపి, స్టీరింగ్ మీద వాలి కుప్పకూలిపోయారు. అక్కడే ఉన్న చంద్రశేఖర్ అనే సహోద్యోగి వెంటనే స్పందించి బాబును యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మరణించినట్లుగా ధ్రువీకరించారు. ఎస్సై ఈశ్వర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా గణపతి ఆలయ కుంభాభిషేకం



ఎమ్మెల్యే జగన్మోహన్‌ను ఆహ్వానిస్తున్న ఏఎల్.పురం గ్రామస్తులు

గుడిపాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్.పురం బీసీ కాలనీలో సోమవారం మహాగణపతి ఆలయ మహాకుంభాభిషేకాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పురోహితుడు మహేష్‌శర్మ గోపూజ, విశ్వరూప దర్శనం, స్వామి ప్రణప్రతిష్ఠ హోమం, శాంతి హోమం, మహాపూర్ణ హోమం, వసుధార కలశ ఉద్వాసన, యాత్రదానం నిర్వహించారు. అనంతరం కుంభ జల అభిషేకం నిర్వహించారు. అలంకరణ, సంకల్పం, అర్చనను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవుల నాయుడికి మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, రెడ్డెప్ప, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, రమేష్ నాయుడు, జగదీశ్వర్ నాయుడు, గురప్ప నాయుడు, రాజు, హరిప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ నేతల సంతకాల సేకరణ

పూతలపట్టు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయనిపల్లి, వేనూతనపల్లి, పోలవరం గ్రామాల్లో వైసీపీ నేతలు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించకూడదంటూ సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి పోలవరం సుధాకర్‌రెడ్డి, నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడండి

పాలసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పంచాయతీల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవో సతీష్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేయడానికి సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. వర్షాలు ఎక్కువగా కురిసినందున తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య, పీఆర్ ఏఈ జయరాజ్, ఏపీవో మార్గరేట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో సీఐ తనిఖీ

శ్రీరంగరాజపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌ను సోమవారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, క్రైమ్ రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్

● ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి కోసం ప్రయాణికులకు ఇక్కట్లు



ఆర్టీసీ బస్టాండ్‌లో అలంకార ప్రాయంగా మారిన ఆర్వో యంత్రం

చిత్తూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి యంత్రం ప్రదర్శనకు మాత్రమే పరిమితమైంది. ఇటీవల ఈ ఆర్వో యంత్రాన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటు చేసింది. దానిని నిర్వహణను చూడాల్సిన ఆర్టీసీ అధికారులు గాలికి వదిలేశారు. దీంతో ప్రయాణికులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. డిపో మేనేజర్ కార్యాలయం, డీపీటీవో కార్యాలయం ఎదురుగా ఉన్నా దీనిని పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు కూడా ఇచ్చారు. ఆర్వో మరమ్మతులకు గురై నెల రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పోనీ వాటర్ బాటిల్ కొనుక్కొని తాగుదామన్నా.. ప్రతి బాటిల్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తుండడంతో చేసేది లేక దాహంతోనే వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

● కేసు నమోదు

వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తన భర్త అదృశ్యమయ్యాడని, ఆచూకీ కనిపించడం లేదని కార్వేటినగరం మండలం కేఎంపురంకు చెందిన ఎన్.హరిణి(22) సోమవారం సాయంత్రం కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు... కార్వేటినగరం మండలం కేఎంపురం గ్రామానికి పి.లోకనాథం ఈ నెల 7వ తేదీన కార్వేటినగరం ఇండియన్ బ్యాంకు వద్దకు వచ్చారు. ఆ తరువాత అక్కడి నుంచి వెళ్లారని, ఆ రోజు నుంచి కనిపించడం లేదని, తన భర్త ఆచూకీ తెలియడం లేదని సోమవారం కార్వేటినగరం పోలీసులకు హరిణి ఫిర్యాదు చేసింది. దీనిపై కార్వేటినగరం ట్రైనీ ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం: టీడీపీ



రైతులతో మాట్లాడుతున్న ఎస్పీ ధరణీప్రసాద్

బంగారుపాళ్యం, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వమని మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్పీ ధరణీప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం ఆ సంఘ అధ్యక్షుడు నేతాజీ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధరణీ ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతుల కోసం సబ్సిడీ ద్వారా గోకులం షెడ్లు, ఛాఫ్‌కట్టరు అందజేశామని, యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించామని తెలిపారు. ప్రస్తుతం ఆక్వా, మునగ సాగుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జనార్థన్, సింగిల్ విండో అధ్యక్షుడు హేమచంద్ర నాయుడు, ఉప సర్పంచు లోకనాథ నాయుడు, రమేష్, ఏపీఎం రవి, కార్యదర్శి రాజేంద్ర నాయుడు, కోశాధికారి నీరజాక్షులు గౌడ్, జీవరత్నం నాయుడు, అన్ను తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న స్కూటర్: టీచరు మృతి

పూతలపట్టు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముందు వెలుతున్న లారీని స్కూటర్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం, పీఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటరత్నయ్య కుమారుడు ప్రభాకర్ (42) తమిళనాడులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను సోమవారం 11 గంటల ప్రాంతంలో స్వగ్రామం నుంచి పాఠశాలకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, ముందువెలుతున్న లారీని ఢీకొట్టాడు. దీంతో ప్రభాకర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాల రిపోర్టర్లపై చర్యలు తీసుకోండి

చిత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇద్దరు వెదురుకుప్పం రిపోర్టర్లపై విచారించి చర్యలు తీసుకోవాలని గొడుగుచింతకు చెందిన ప్రసాద్ సోమవారం కలెక్టర్‌ను కోరారు. బ్రాహ్మణపల్లె, పెరుమాళ్లపల్లె సచివాలయాల్లో అధికారులను బెదిరించి రైతులకు చెందాల్సిన యూరియా బస్తాలు, డ్రిప్ పరికరాలు, పైపులను తీసుకెళ్లి నల్లబజారులో అమ్ముకున్నారని తెలిపారు. మండలంలోని చాలా సచివాలయాల్లో వీరి బెదిరింపులను తట్టుకోలేక అధికారులు, సిబ్బంది బాధపడుతున్నారని పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

బ్లాక్ మెయిల్ చేసే విలేకరులపై చర్యలు తప్పవు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జర్నలిజం పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేసే విలేకరులపై చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటం, వారిని బ్లాక్ మెయిలింగ్ చేయకుండా విధి నిర్వహణ చేసుకునే వాతావరణాన్ని కల్పించడం కలెక్టర్‌గా తన బాధ్యత అన్నారు. వెదురుకుప్పంలో ఇద్దరు రిపోర్టర్లపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదును పురస్కరించుకుని సమగ్ర విచారణ చేయాలని చిత్తూరు ఆర్డీవోను ఆదేశించానని చెప్పారు.

విలేకర్లను బెదిరించడం మానుకోవాలి

చిత్తూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, విలేకర్లను బెదిరించడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలో అక్రమ మైనింగ్, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోని కలెక్టర్, వాటిని బయటపెడుతున్న విలేకర్లపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఫోన్లు చేసి విలేకర్లను బెదిరించడం ఏమిటన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గోపినాథ్, మణి, రమాదేవి, మహేష్, జమిలాబీ, దినేష్ పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న నిర్వాహకులు

బంగారుపాళ్యం, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, చెన్నై శంకర్ నేత్రాలయం వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఈ శిబిరానికి మండల పరిసర ప్రాంతాల నుంచి 45 మంది రోగులు హాజరు కాగా, ఇందులో 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, వీరికి చెన్నై లోని శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారని తెలిపారు. వీరికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహశీల్దార్ షబ్బీర్ బాషా

బంగారుపాళ్యం, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహశీల్దార్ షబ్బీర్ బాషా తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో రైతులు పలు సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని వీఆర్వో, సర్వేయర్లకు సూచించారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగరాజు

యాదమరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యాదమరి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరాజుకు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పార్టీ మండలాధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీలకు కృతజ్ఞతలు తెలిపారు.

● నగరి(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడకి చెందిన ఎస్.ముత్తయ్య(కరుణ)ను మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కష్టపడే వారికి పదవులు పంపిణీలో ఎమ్మెల్యే ముందంజ వేస్తున్నారని నగరి టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

● వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంగాధరనెల్లూరు మండలం మహదేవ మంగళంకు చెందిన ఎస్ఎస్ నటరాజన్ నియమితులయ్యారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టరుగా చినబాబు ఎంపికపై హర్షం

విజయపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు) డైరెక్టరుగా ఎంపిక కావడంపై మండల టీడీపీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఆయన టీడీపీ కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ పదవి వరించిందన్నారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, చిత్తూరు పార్లమెంటు ముదిరాజ్ కన్వీనర్ డాక్టర్ ఉమాపతిరావ్, టీడీపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మునగ పంట సాగు కోసం దరఖాస్తు చేసుకోండి

తవణంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం కింద అర్హులైన రైతులు మునగ పంట సాగు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఏపీవో బాల తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి కల్పనతో పాటు ఆదాయం పెంచడమే లక్ష్యంగా మునగ సాగు కోసం తవణంపల్లె మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఐదు ఎకరాలలోపు పొలం, ఉపాధి హామి జాబ్ కార్డు కలిగి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీవో తెలిపారు. దరఖాస్తులను ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్‌కు, ఆయా గ్రామాల్లో గల సంఘ మిత్రలకు అందజేయాలని అన్నారు.